RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

శుక్ర వారం
12-01-2024
సంపుటి - 09,
సంచిక - 429
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra P

CEO & Editor : G. PRUDHVIRAJ

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
జాతీయ తెలుగు వార్త పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# పనులు చేయకుండా ప్రచారం చేస్తే బాగుండేది

## కాంగ్రెస్ దుష్ప్రచారం వల్లనే ఓడిపోయాం



అయిన మూడోవంతు సీట్లను గెల్చుకున్నాం● ఓట్ల తేడాకూడా కేవలం 1.85 శాతం మాత్రమే
కలసికట్టుగా పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలి● మహబూబాబాద్ సమీక్షలో బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్, జనవరి 11 (సమ సమాజం):** పనుల మీద కంటే ప్రచారం మీద ఫోకస్ చేసి ఉంటే బీఆర్ఎస్ గెలిచేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజల సౌకర్యమే చూసాము కానీ రాజకీయ ప్రయోజనము, రాజకీయ ప్రచారమే గురించి ఏనాడు ఆలోచించలేదని అన్నారు. ప్రజలు కూడా బీఆర్ఎస్ ను పూర్తిగా తిరస్కరించలేదని అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకర్గ సన్నాహక సమావేశం లో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అబద్దాల ముందు అభివృద్ధి ఓడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పనుల మీద కంటే ప్రచారం మీద ఫోకస్ చేసి ఉంటే బీఆర్ఎస్ గెలిచేదని అన్నారు. వందలాది సంక్షేమ కార్యక్రమాలు మన ప్రభుత్వ హయాంలో అమలు చేసినా,ఏనాడు కూడా ప్రజలను లైన్లలో నిలబెట్ట లేదని స్పష్టం చేశారు. .బీఆర్ఎస్‌కి మూడో వంతు సీట్లు 39 వచ్చాయి. 14 స్థానాల్లో ఓటమి కేవలం గరిష్టంగా 6 వేల ఓట్ల తోనే జరిగింది. మొత్తంగా కాంగ్రెస్ మనకు తేడా కేవలం 1.85 శాతం అన్నారు. పార్టీ సమావేశాలను వరుసగా పెట్టుకుంటామని అన్నారు. అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తామని తెలిపారు. పార్టీకి అన్ని వర్గాలను దగ్గరయ్యేలా కార్యక్రమాలు చేపడ తామని అన్నారు. గిరిజనులకు స్థానిక సంస్థల రిజర్వేషన్ తో పాటు.. పోడు భూముల పట్టాల పంపిణీ, అనేక ఇతర సంక్షేమ పథకాలు అనేక కార్యక్రమాలను మన ప్రభుత్వం గతంలో అందించిందన్నారు. అయినా గిరిజనం ఎక్కువ ఉన్న చోట్లకూడా ప్రజలు పూర్తి మద్దతు మనకివ్వలేదు, ఇలాంటి వాటన్నింటి సమీక్ష చేసుకుని ముందుకుపోతామన్నారు. ప్రజలు మనకు పదేళు అవకాశం ఇచ్చారు. అధికారంలోకి వస్తాం అని కాంగ్రెస్ పార్టీ వాళ్లు కూడా అనుకో లేదు. నోటికి ఏది వస్తే అది హామీలుగా ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించారని కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారెంటీలు అన్నారు. కానీ 420 హామీలిచ్చారు. కాంగ్రెస్ వాళ్ల తప్పుడు ప్రచారం నమ్మి ప్రజలు గొప్పగా పని చేసిన నాయకులను కూడా తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు ఇవ్వలేదు అని తప్పుడు ప్రచారం చేశారు. ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఆరోపంచారు. తొమ్మిది న్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 6,47,479 రేషన్ కార్డులు ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. అంతేకాదు దేశంలో

4వ పేజీలో...

# పటిష్ట సంస్థగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్

## నిబద్ధత కలిగిన అధికారిని ఛైర్మన్‌గా నియమించే ఛాన్స్

**హైదరాబాద్, జనవరి 11 (సమ సమాజం):** ఉద్యోగాల భర్తీకి ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. ప్రధానంగా టిపిపిఎస్సీన ప్రక్షాళన చేసేందుకు రంగం సిద్దం చేస్తోంది. దీనిని పకడ్బందీ సంస్థగా తయారు చేసి, సమర్థులైన అధికారులను నియమించి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వడం ద్వారా నిరుద్యోగులకు భరోసా కల్పించే ప్రయత్నంలో సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. ఇప్పటికే యూపిపిఎస్సీ ఛైర్మన్‌ను కలసి అక్కడ అనుసరిస్తున్న విధానాలను సిఎం తెలుసుకున్నారు. అదే తరహాలో సర్వీస్ కమిషన్‌ను పునరుద్ధరించాలని చూస్తున్నారు. రిటైర్ట్ లేదా సర్వీసులో ఉన్న నిబద్ధత కలిగిన ఐఎఎస్ లేదా ఐపిఎస్‌ను ఛైర్మన్‌గా వేసి పరీక్షలు నిర్వహించాలని యోచిస్తున్నారు. సభ్యులను కూడ రాజకీయాలతో సంబంధం లేని వారిని, నిష్ణాతులను, అకడమిక్ అనుభవం ఉన్నవారిని వేసే ఆలోచనలో సిఎం ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరీక్ష పేపర్లు లీక్ కావడంతో కమిషన్ అభాసుపాలయ్యింది. ఐఎఎస్ అధికారి ఛైర్మన్‌గా ఉన్నా లాభం లేకుండా పోయింది. పేపర్ల లీకేజీల వ్యవహారంలో నాటి కెసిఆర్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కలేదు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం పోరాడుతున్నా పట్టించుకోలేదు. సరికాదా లక్షా 40వేల ఉద్యోగాలను భర్తీ చేశామని బుకాయిస్తూ వచ్చారు. ఎక్కడ, ఎప్పుడు, ఎలా భర్తీ చేశారన్నదానికి సమాధానం లేదు. అందుకే నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల

4వ పేజీలో...




రాజకీయాలకు దూరంగా సభ్యుల నియామకం♦కసరత్తు చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే

## ఉల్లంఘునులపై కఠిన చర్యలు: సిపి



**హైదరాబాద్, జనవరి 11 (సమ సమాజం):** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం నాడు తన కార్యాలయంలో సీపీ శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... నగరంలో ట్రాఫిక్ సెక్యూరిటీ వీక్‌ని జరుపుకుంటున్నామన్నారు. ఎక్కువగా వాహనాలు సిటీలోకి రావడంతో ట్రాఫిక్

4వ పేజీలో...

---

# ఆంధ్రా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు

## సంక్రాంతి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు

నగరాన్ని వీడుతున్న ప్రజలు



**హైదరాబాద్, జనవరి 11 (సమ సమాజం):** సంక్రాంతి పండుగొచ్చిందంటే దేశంలో ఏపీ వాళ్లు ఎక్కడ ఉన్నా.. సొంతూళ్లకు పయనం అవుతారు. రెండు మూడు నెలల ముందు నుంచే ఇందుకు సన్నద్ధం అవుతారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతి పెద్ద పండుగ సంక్రాంతి కావడంతో ఇప్పటి నుంచే అక్కడికి తరలి వెళ్లేందుకు సిద్ధం

4వ పేజీలో...

# సంక్రాంతికి సై అంటున్న జాతి పుంజులు

## గ్రామాల్లో అప్పుడే పందాల హడావిడి

పలు గ్రామాల్లో బరులతో పాటు, పుంజులు రెడీ



**విజయవాడ, జనవరి 11 (సమ సమాజం):** సంక్రాంతి పండగ సమీపించడంతో జిల్లాలో పలువురు పందెంరాయుళ్లు పుంజులను పోటీలకు సిద్ధం చేసి సై అంటున్నారు. గడచిన ఆరు నెలలుగా ఫాంహౌస్‌ల్లో పెంచుతున్న పుంజులకు గడచిన కొన్ని రోజులుగా శిక్షణ ఇచ్చి ఇప్పుడు వీటిని లక్షలకు విక్రయిస్తూ భారీగా అర్జిస్తున్నారు. దీంతో జిల్లాలో పలుచోట్ల పుంజుల వ్యాపారం కోట్లలో జరుగుతోంది. మెట్టప్రాంతమైన పెద్దాపురం డివిజన్‌లో గల జగ్గంపేట, ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, పెద్దాపురంతోపాటు ఏజెన్సీ మండలాల్లో సంక్రాంతి పండుగకు సంప్రదాయ క్రీడల ముసుగులో జూదాలు నిర్వమించడానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. కోడిపందాలు, పేకాట, గుండాట కోసం గ్రామాల్లో జూదరులు పలుచోట్ల ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గం నడిబొడ్డున జూదాలు నిర్వహించేందుకు ప్రణాళికతో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే 3రోజులపాటు కోడిపందాలు నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిసింది. కోళ్లకు కత్తికట్టకుండా పందెం జరిపేటట్టు ఉభయ రాష్ట్రాలు, విశాఖ, కృష్ణ, గుంటూరు, నెల్లూరు ప్రాంతాల నుంచి వచ్చి పందెంరాయుళ్లు ఒక సమావేశం ఏర్పాటు చేసుకుని ఒప్పందం చేసుకున్నారు. రోజుకు 20 జోడీల చొప్పున 3 రోజులకు 60 జోడీలు కోళ్లతో ట్రైల్‌రన్ వేసి సంక్రాంతి పండుగకు పందెంకోళ్లను సిద్ధం చేసుకున్నారు. దీంతో కోట్ల రూపాయిలతో ఈ ప్రాంతంలో పందాలు జరగడానికి అవకాశమున్నట్టు సమాచారం. తమ గ్రామానికి కొంతమొత్తంలో సొమ్ములు చెల్లించేందుకు పందెం రాయుళ్లతో ఒప్పందం కుదుర్చుకోవడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఏకమై ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం సంక్రాంతి పండుగను సంప్రదాయ క్రీడలతో సంక్రాంతి జరుపుకోవాలనుకుంటున్నారు. మరోపక్క కోడిపందాలు, గుండాటలకు పెద్దలు, పోలీస్, రెవెన్యూ వ్యవస్థలు పందాలు వేసేందుకు చూస్తున్నట్టు

4వ పేజీలో...

# దళితబంధు కోసం కొందరి ఆందోళన

**నిజామాబాద్, జనవరి 11 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలరోజుల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదిని బిఆర్ఎస్ విమర్శిస్తోంది. ఈ క్రమంలో కొందరు దళితబంధు కోసం అంటూ దర్నాకు దిగారు. గత ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకాన్ని అమలు



4వ పేజీలో...

# 14నుంచి రాహుల్ న్యాయయాత్ర

## మణిపూర్‌లో మొదలు..ముంబైలో ముగింపు




**న్యూఢిల్లీ, జనవరి 11 (సమ సమాజం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర జనవరి 14న మణిపూర్ నుంచి ప్రారంభం కానుందని ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి శమా అహ్మద్ పేర్కొన్నారు. మీడియా సమావేశంలో ఈ మేరకు తెలిపారు. మణిపూర్‌లో ప్రారంభమయ్యే ఈ యాత్ర దేశంలోని 15 రాష్ట్రాల గుండా కొనసాగి ముంబయిలో ముగుస్తుందన్నారు. ఈ క్రమంలో యాత్రలో భాగంగా 110 జిల్లాలు, 100 లోక్‌సభ స్థానాలు, 337 అసెంబ్లీ స్థానాలను కవర్ చేయనున్నట్లు చెప్పారు. ఈ యాత్ర కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. అంతేకాదు ఈ యాత్రలో భాగంగా దేశంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలను ప్రస్తావించనున్నట్లు చెప్పారు. దీంతోపాటు దేశంలో యువత ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు

4వ పేజీలో...

# అయోధ్య అందరి కార్యక్రమం

## కాంగ్రెస్ రాజకీయం చేయడం సరికాదు: బండి



**కరీంనగర్, జనవరి 11 (సమ సమాజం):** అయోధ్య రామయ్య అందరికీ దేవుడని.. రామ మందిర నిర్మాణం బీజేపీ కార్యక్రమం కాదని ఆ పార్టీ ఎంపీ బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇది కోట్‌ఆది భారీతీయులకు సంబంధించిన కార్యక్రమమని అన్నారు. ఇదేదో రాజకీయ కార్యక్రమంగా కొందరు వ్యాఖ్యానించడం దురదృష్టకరమని అన్నారు. గురువారం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు బహిష్కరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాముడి చెంతకు రావడానికి అందరూ అర్హులేనని అన్నారు. రాజకీయంగా ముడపెట్టి కాంగ్రెస్ తన సంకుచిత ధోరణిని చాటుకుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ చెప్పిందని.. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై విచారణ ఎందుకు జరిపించడం లేదని ప్రశ్నించారు.కేవలం మేడిగడ్డ బ్యారేజీపైనే ఎందుకు జ్యూడిషియల్ విచారణ అడుగుతున్నారని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం కోరితే సీబీఐ విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ తీరు బీఆర్ఎస్ నేతల అవినీతిని కప్పిపుచ్చేలా ఉందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ కోరాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# యువత చైతన్యదీప్తిగా సాగాలి !

చాలామంది యువతలో ఆత్మస్థయిర్యం ఉండడం లేదు. ఉద్యోగం రాలేదనో.. ప్రేమించిన అమ్మాయి కాదన్నదనో.. చదవుకు డబ్బులు లేవనో.. ఇలా ఆత్మ న్యూనతతో ఆత్మహత్యలకు పాల్పడు తున్నారు. చిన్నిచిన్న కారణాలతో పెద్దదైన జీవితాన్ని కోల్పోతున్నారు. ఈ ప్రపంచం విశాలమైనది. చిన్న చిన్న విషయాలకు కుంగిపోతే పెద్ద లక్ష్యాలను సాధించలేం. అలాంటి వారు వివేకానందను స్ఫూర్తిగా తీసుకో వాలి. చిన్న వయసులోనే ఎన్నో విజయాలు సాధించిన ఉదాత్తమూర్తి స్వామి వివేకానంద. ప్రపంచానికే స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడు ఆయన. నేటి యువతకు స్వామి వివేకానంద బోధనలు అనురణీయం. నిర్వీర్యమై, నిరాశా నిస్పృహలో కొట్టుమిట్టా డుతున్న యువత మేల్కోవాలి. భారత దేశంలోఎందరో మహానుభావులు అప్పుడప్పుడూ తళుక్కున మెరిసి జాతిని మేల్కొలిపారు. సమాజాన్ని రుజువర్తనలో పెట్టే ప్రయత్నాలు చేశారు. ఆ తరవాత వారి అడుగు జాడల్లో నడిచి దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లిన వారూ ఉన్నారు. అలాంటి మహానుభావుల్లో స్వామి వివేకానందుడు అగ్రగణ్యుడు అని చెప్పక తప్పదు. వివేకానందుడు హిందూసమాజ పునరుజ్జీవనానికి, సాంస్కృతిక జాతీయవాదాన్ని శక్తిమంతం చేయటానికి చేసిన కృషి అనన్య సామాన్యం. ఆయన బోధనలు ఇప్పుడు ప్రపంచ మానవాళి అనుసరిస్తూ ముందుకు సాగుతోంది. నిరాశలో కూరుకుపోయిన నేటియువత మేల్కోవాలి. జాతిని జాగృతం చేసే బాధ్యతను తీసుకోవాల్సి ఉంది. వివేకానందుడు ఒక ఆధ్యాత్మిక వేత్త, దార్శనికుడు, సామాజిక పరివర్తకుడు. విచ్ఛిన్న కర శక్తుల ప్రాబల్యం పెరుగుతున్న క్రమంలో దేశాన్ని జాగృతం చేయాల్సిన అవసరం ఇప్పుడే ఉంది. తమకోసం..తమవారి కోసం ..ఈ దేశంకోసం వారు నడుం బిగించాల్సి ఉంటుంది. దేశాన్ని రక్షించుకో వాల్సిన అవసరం మేరకు అడుగులు వేయాలి. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలి. జాతిని జాగృతం చేసి దేశ ఐక్యతకు నడుంబిగిస్తేనే ..నవశకం ఆరంభం కాగలదని గుర్తించాలి. మహాత్ముల జీవితాలను చదవి ఉత్తేజితం కావాలి. ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు.. అంటాడు స్వామి వివేకానంద.. ఆయన మాటలన్నీ ప్రేరణకు స్ఫూర్తిగా నిలిచేవే. భారతదేశాన్ని చదవాలంటే వివేకానందుణ్ని చదివితే చాలు. రామకృష్ణ పరమహంస వద్ద నాలుగేళ్ల శుశ్రూషలో నరేంద్రుడు నేర్చుకున్న ఆదర్శాలే తరవాత అతడిని మహనీయుడిగా తీర్చిదిద్దాయి. సంపద సృష్టికర్తలైన శ్రామికులే ఈ దేశ ఆశాకిరణాలని స్వామి వివేకానంద ఆనాడే చెప్పారు. 18, 19 శతాబ్దాల్లో స్తబ్ధమైన భారతీయ సమాజాన్ని మేల్కొల్పడానికి రాజారామ్ మోహన్‌రాయ్, కేశవచంద్రసేన్, దయానంద సరస్వతి సారథ్యంలో కొనసాగిన సంస్కరణోద్యమాన్ని వివేకానందుడు గొప్ప ముందడుగు వేయించాడు. అనేక ప్రాచీన చింతనా ధోరణు లను స్ఫూర్తిగా తీసుకొని స్పష్టమైన దృక్పథంతో కార్యాచరణతో జ్ఞాన విప్లవాన్ని వివేకానందుడు ఆరంభించాడు. వ్యవస్థీకృతమైన రుగ్మతలను ఎదిరించడం, సంస్కరించడం వంటి వివేకానందుడి విప్లవాత్మక భావాలు ఇప్పటికీ అనుసరణీయంగా ఉన్నాయి. మృత ప్రాయంగా ఉన్న వ్యవస్థకు కొత్త ఊపిరిపోసి, కొత్త నెత్తురు ఎక్కించిన పునరుజ్జీవన, జాతీయోద్యమ, విప్లవోద్యమ కేంద్ర స్థానమైన బెంగాల్ మాగాణంలో ఉద్భవించిన మేధావి వివేకానందుడు. మనషిలో నిగూఢమై ఉన్న పరిపూర్ణ త్వాన్ని వ్యక్తం చేయించేది విద్య అని వివేకానందుడు నిర్వచించాడు. జీవితాన్ని నిర్మించడమూ, సద్గుణ సంపన్నులైన మనుషులను రూపొందించడమూ విద్య ఆశయాలుగా ఆయన పేర్కొన్నాడు. విద్యలో సమాన అవకాశాలను కల్పించిన ప్రాచీన నలంద, తక్షశిల, విక్రమశిల, వల్లభి విద్యలయాల సుసంపన్న సంప్రదాయాన్ని పునఃప్రతిష్టింప చేయాలని, ప్రభుత్వము, పౌరసమాజం విద్యను అందించడమే ప్రథమ

కర్తవ్యంగా చేపట్టాలని ప్రజలను చైతన్యవంతం చేశాడు. ఆ నాటి సమాజంలో వ్యవస్థీకృతమైన రుగ్మతలను ఎదిరించడం సంస్కరించడం వంటి వివేకానందుడి విప్లవాత్మక భావాలు ఇప్పటికీ ప్రాసంగికతను కలిగివున్నాయి. పునరుద్ధరణవాద, తిరోగమన, విచ్ఛిన్నకర శక్తుల, సామాజిక బాధ్యత లేని పెట్టుబడి దారీ శక్తుల ప్రాబల్యంతో పేదరికం, అశాంతి, అసహనం నెలకొన్న ప్రస్తుత సమాజాన్ని మానవత్వం వైపు మళ్ళించడానికి వివేకానందుని కృషిని కొనసాగించడమే మార్గం. దేశం పరాయిపాలన నుంచి విముక్తం అయ్యాక స్వార్థ రాజకీయ శక్తుల చేతుల్లో ఓడిపోతోంది. ఈ క్రమంలో యువత బాగా ఆలోచించాలి. పేదరికం, అశాంతి, అసహనం నెలకొన్న ప్రస్తుత సమాజాన్ని మానవత్వం వైపు మళ్ళించడానికి వివేకా నందుని కృషిని కొనసాగించడమే మార్గంగా ఎంచుకోవాలి. పేదవాని కష్టంతో పైకి వచ్చిన పాలకులు.. వారి బాగోగులను పట్టించుకోవడం లేదు. ఎప్పుడో వివేకానందుడు ఇలాంటి వన్నీ తన ప్రసంగాలతో ప్రపంచాన్ని ఉర్రూత లూగించారు. ఎంతో తత్వజ్ఞానం పొందిన స్వామి వివేకానంద మనలో ఉన్న జాడ్యాన్ని తొలగించి... ఉత్తేజితం చేసి ప్రేరణ కల్పించడానికి పుట్టిన ఓ మహాయుగకర్తగా భావించాలి. ప్రతి మతంలోను,ప్రతి సిద్ధాంతంలోను, ఎంతో కొంత మంచి వుంటుంది. సోదరప్రేమ గురించి ప్రసంగాలు మాని, ఆ ప్రేమను కార్యరూపంలో ప్రదర్శించండని పిలుపును ఇవ్వడమే కాదు.... ఆచరించి చూపాడు. వివేకానందుడు ప్రవచించిన మార్గం ఎప్పటికీ అనుసరణీయమే. దరిద్ర నారాయణసేవే పరమధర్మమని వివేకానందుడు అంటారు. మానవాళికి చైతన్య దీప్తిగా స్వామి వివేకానంద విశ్వవిఖ్యాతి పొందినాడు. కర్మ, భక్తి, రాజ, జ్ఞాన యోగాలపై ఆయన చేసిన రచనలు ఆత్మశక్తిని వెలికితీసే ఆయుధాలు. గాంధీలాంటి అహింసా మూర్తులకూ, సుభాష్ చంద్రబోస్, అరవింద్ ఘోష్, జతిన్‌దాస్ లాంటి అతివాదులకూ వివేకానందుడు స్ఫూర్తిగా నిలిచారు. అలాంటి బాటలో మనమెందుకు నడవకూడదన్న ఆలోచన చేయాలి. ప్రాచీన కాలపు గ్రీసులో సోక్రటీసు గొప్ప గురువు. ప్లేటో గొప్ప శిష్యుడు. గురువంటే రామకృష్ణుడు. శిష్యుడంటే వివేకానందుడు అలా ఉద్భవించారు. ప్రజలు విద్యకు, విజ్ఞానానికి దూరంగా మూఢవిశ్వాసాలకు ,దారుణ సాంఘిక దురాచార కబంధహస్తాల్లో నలిగి పోవడం చూడలేక చైతన్యదీప్తి రగిలించాడు.భారతీయ మూలాల నుండి నిజమైన వేదాంత దృక్పథాన్ని రూపొందించి, జాతిమత పరమైన అన్ని రకాల అధిపత్యాలను, రూపుమాపే ప్రజాస్వామిక సిద్ధాంతంగా మార్చాడు. 1893లో చికాగో నగరంలో ప్రపంచ మత సదస్సుకు హాజరై భారతీయ తత్వసారాన్ని అద్భుత రీతిలో తెలియజేసి, ప్రపంచాన్ని ఆకట్టుకున్నాడు.

# యువతకు చోదశక్తిగా స్వామి వివేకానంద

**చికాగో ప్రసంగంతో ప్రపంచ మేధావిగా గుర్తింపు**

**స్వామితో ప్రేరణ పొందిన సిస్టర్ నివేదిత**



కోల్‌కతా,జనవరి 11 (సమ సమాజం): బలహీనతల్ని తొలగించుకో. పౌరుషాన్ని ప్రసాదించుకో. మనిషిగా మసలుకో. లే..... లెమ్ము అంటూ యువతను జాగృతం చేసిన వేదాంతభేరి స్వామి వివేకానంద. భారతదేశాన్ని ప్రేమించడమెలాగో, ఉద్ధరించడమెలాగో నేర్పిన మహనీయుడు స్వామి వివేకానంద! దేశ ప్రజలందరికి ఆత్మవిశ్వాసం క్రియా శూరత్వం కావాలి. ఈ అవసరం నాకు స్పష్టంగా కనిపిస్తుంది అని నొక్కి చెప్పారు. భగవంతుడి పట్ల నమ్మకం లేనివాడు నాస్తికుడు అనేది ఒకప్పటి మాట. వివేకానందుడు గొప్ప తాత్వికుడు. అతని ముఖ్య బోధనల ప్రకారం అద్వైత వేదాంతం తత్త్వ శాస్త్రములోనే కాకుండా, సామాజికంగా రాజకీయంగా కూడా ఉపయోగ పడుతుంది. అందుకే ఆయన చికాగో సర్వమత సమ్మేళనంలో చేసిన ప్రసంగం నేటికీ చిరస్మరణీయంగా నిలిచిపోయింది. మహోన్నతమైన ఆదర్శం ఎన్నుకుని నీ జీవితాన్ని మలుచుకోవాలని అంటాడు. భారతదేశ ఘనతను వర్ణిస్తూ ఆయన ఒక్కడే తన ప్రసంగం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పాడు. విశాలమై అనంత విస్తృతిని పొంది తోటి మానవ జాతినే కాక పశు పక్ష్యాదులతో సహా సమస్త ప్రాణికోటి చేత సర్వజగత్తు ఉచ్చంనీచం లేకుండా తనతోనే ఉన్నట్లు భావించాలని అంటారు. సరిగ్గా గీతోపదేశంలో శ్రీకృష్ణ పరమాత్ముడు బోధనలను ఆయన తన వాక్యాల్లో సూటిగా చెప్పారు. మనిషిలో అహం తగ్గి, ఇతరులను ప్రేమించాలన్న భారతీయ ఐతిహ్యాలకు ప్రతీకగా వివేకానందుడి ఉపన్యాసాలు ప్రేరణగా నిలిచాయి. అందరు తనవారనుకుంటేనే నిజమైన స్వేచ్ఛ లభిస్తుందనే వేదాంత తత్వానికి చెందిన వ్యక్తి వివేకానందుడు. ఆయన బోధనలు, అనుసరించిన మార్గాలు నేటికీ యువతకు ప్రేరణగా నిలుస్తాయి. పిరికితనానికి మించిన మహాపాపం ఇంకోటి లేదు. ఒక దెబ్బతింటే రెట్టింపు ఆవేశంతో పది దెబ్బలు కొట్టాలి, అప్పుడే మనిషినని అనిపించుకొంటావు. పోరాడుతూ చనిపోయినా ఫర్వాలేదు. కాని పోరాటం అవసరం అంటాడు. ఆత్మవిస్వాసం లేకపోవడం అనేది క్షమించరాని నేరం. గొప్ప వ్యక్తుల జీవతాలన నిశితంగా పరిశీలిస్తే వారిని నడిపించింది ఆత్మవిశ్వసమేనని తెలుస్తుంది. ప్రేమ... డబ్బు... జ్ఞానం.. చదువు... దేనికోసమైనా తపనపడుతూ పిచ్చివాడై పోయేవాడికి అది తప్పకుండా దొరుకుతుందంటాడు. అందుకోసం మనం ఉడుంపట్టు లాంటి పట్టుదల, సంకల్పబలం, శ్రమించే తత్వం కనబర్చాలని ఉద్బోధించాడు. అతడి జీవితంపై రామకృష్ణ పరమహంస ప్రభావం ఎంతగానో ఉంది. సామాన్యుడిగా ఉన్న నరేంద్రుడు వివేకానందుడిగా మారడానికి గురువుగా రామకృష్ణ పరమహంస ఎంతగానో ప్రభావితం చేస్తాడు. జీవితంలో గురువు అవసరం ఎంతగా ఉంటుందో పరమహంస వల్ల తెలుస్తుంది. పేదవారి సేవతో భగవంతుని సేవ అనే పదాన్ని ప్రతిపాదించి అది వివేకానందుడికి బోధించడం వల్లనే ఇవాళ రామకృష్ణ ఆశ్రమాలు సేవలో తరిస్తున్నాయి. వ్యక్తిగత మోక్షం పై వ్యామోహం కూడా వదిలివేసి, ఇతరులను బంధవిముక్తులను చెయ్యడమే మనిషికి జ్ఞానోదయము అని నమ్మిన మనిషి రామకృష్ణ పరమహంస. అదే వేదవాక్కుగా జీవించి దరిద్ర నారాయణులకు సేవచేయడమే పరమౌషధమని నమ్మిన వ్యక్తి వివేకానందుడు. వేదాంత సారాన్ని ఒక్కముక్కలో రామకృష్ణుడు చేసిన బోధనలు వివేకానందుడి గతిని మార్చాయి. అందుకే స్వామి వివేకానందను కలుసుకొని, ఆయన సాంగత్య భాగ్యం పొందిన విషయాలను ఘనంగా చాటారు సిస్టర్ నివేదిత. ఆయన ప్రభావం పాశ్చాత్యదేశాల వైఖరినే ఆమూలాగ్రం మార్చివేసి ఉంటుందని సోదరి నివేదిత వ్రాసింది. పాశ్చాత్య దేశాలకు మాత్రమే కాదు, భారతదేశానికి మాత్రమే కాదు, ప్రపంచానికే అన్వయించే భావన స్వామిది. స్వామి వివేకానంద అమృత వాక్కులు నిత్యసత్యాలు.

## గొంతులో ఇరుక్కున్న చికెన్ ముక్క

**ఊపిరాడక మరణించిన యువకుడు**

రంగారెడ్డి,జనవరి 11 (సమ సమాజం): మృత్యువు ఎప్పుడు.. ఎవరికి.. ఏ రూపంలో వస్తుందో ఎవరూ ఊహించలేం. అలాంటి సంఘటనే రంగారెడ్డి జిల్లాలో బుధవారం రాత్రి జరిగింది. అప్పటివరకూ స్నేహితునితో సరదాగా పార్టీ చేసుకున్న ఆ వ్యక్తి ఒక్కసారిగా ఊపిరాడక మృతి చెందాడు. పార్టీలో తిన్న చికెన్ సదరు వ్యక్తి ప్రాణం తీసింది. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జితేంద్ర కుమార్ వర్మ, ధర్మేందర్ తివారీ గత కొంతకాలంగా రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ బుధవారం రాత్రి దావత్ చేసుకున్నారు. చికెన్, పూరీ వండుకున్నారు. మద్యం సేవించి భోజనం చేస్తుండగా.. జితేంద్రకుమార్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఇది చూసిన ధర్మేందర్ కు ఏం జరిగిందో అర్థం కాలేదు. మద్యం ఎక్కువగా తాగి ఉంటాడని, అందుకే స్పృహ కోల్పోయి ఉంటాడని భావించాడు. కాసేపటి తర్వాత అనుమానంతో జితేందర్ శ్వాస తీసుకోవడం లేదని గ్రహించిన ధర్మేందర్ అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించగా.. గొంతులో చికెన్ ముక్క ఇరుక్కోవడంతో జితేందర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై ధర్మేందర్ తివారీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సిఎం రేవంత్‌తో గూగుల్ వైస్ భేటీ



హైదరాబాద్,జనవరి 11 (సమ సమాజం): గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట గురువారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులపై రేవంత్‌తో చంద్రశేఖర్ చర్చించి ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు.. తెలంగాణ పౌరుల అవసరాలను తీర్చడానికి నాణ్యమైన సేవలను అందించడానికి విస్తృత సాంకేతికత, నైపుణ్యం తమ వద్ద ఉందని చంద్రశేఖర్ వివరించినట్టుగా తెలుస్తోంది. గూగుల్ మ్యాప్స్, గూగుల్ ఎర్త్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి సాధ్యమయ్యే రహదారి భద్రతపై కూడా ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి

# కర్నాటక నుంచి అయోధ్యకు 11 ప్రత్యేక రైళ్లు

**31 నుంచి ఐఆర్‌సిటిపి ప్రత్యేక ఏర్పాట్లు**

**అయోధ్యకు సైకిల్‌పై బీదర్ యువకుల బృందం**



బెంగళూరు,జనవరి 11 (సమ సమాజం): అయోధ్యలో నిర్మించిన చారిత్రాత్మక రామాలయాన్ని దర్శించుకునే భక్తుల కోసం రాష్ట్రం నుంచి 11 ప్రత్యేక రైళ్లు ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీరామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 22న జరగనుంది. బాలరామ (రామలల్లా) విగ్రహాలకు పూజలు చేసి రామమందిరాన్ని దర్శించుకునేందుకు కోట్లాది మంది భక్తులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రం నుంచి 11 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నారు. కర్ణాటక - గోవా నుంచి రెండు రైళ్లు బయల్దేరనుండగా, కర్ణాటక నుంచి అయోధ్యకు నేరుగా మిగిలిన 9 రైళ్లు సంచరించనున్నాయి. ఈనెల 31 తర్వాత ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆన్‌లైన్ ద్వారా టికెట్లను బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించింది. ఆన్‌లైన్ మినహా నేరుగా టికెట్లు విక్రయించే వెసులుబాటు ఉండదు. అయోధ్యలో రైళ్లు నిలిపేందుకు అనుగుణంగా ఏ రాష్ట్రం నుంచి ఎన్ని రైళ్లు సంచరించాలో నిర్ణయించారు. ఈ మేరకు కర్ణాటక నుంచి 11 రైళ్లకు అవకాశం లభించనుంది. రామమందిర ప్రారంభాన్ని తిలకించేందుకు వినూత్నంగా ప్రయాణించాలని భావించిన బీదర్ జిల్లా యువకుల బృందం సైకిళ్లపై బయల్దేరింది. డిసెంబరు 25న బయల్దేరిన ఈ బృందం జనవరి 22 నాటికి అయోధ్యకు చేరనుంది. రాముడిపై భక్తితో బీదర్‌లోని చిద్రి రోడ్డుకు చెందిన హనుమాన్ సేవా యువబృందం ఈ యాత్రకు బయలుదేరింది. వీరు 1300 కిలోమీటర్ల దూరాన్ని సైకిళ్లపై ప్రయాణించనున్నారు. బయల్దేరినవారిలో అజయ్‌శర్మ, విజయ్‌శర్మ, ఉదయ్‌శర్మ, భవనేశ్, అంబరీశ్, జగదీశ్, విష్ణు, అభిషేక్, సాయినాథ్ ఉన్నారు. వారణాసికి వెళ్లి కాశీ విశ్వనాథుడుని దర్శించుకుని అయోధ్యకు వెళతారు. ప్రస్తుతం వీరు మధ్యప్రదేశ్ రాష్ట్రం అమర్‌పతాన్ ప్రాంతంలో వెళుతున్నారు. ఇప్పటికే 850 కిలోమీటర్ల మేరకు సైకిల్ సవారీ చేశారు. ఈ మేరకు అజయ్‌శర్మ, విజయ్‌శర్మ బుధవారం బీదర్‌కు చెందిన మీడియాతో ఫోన్‌లో మాట్లాడుతూ ప్రయాణం సజావుగా సాగుతోందని, అయితే చలి, మంచు ఎక్కువగా ఉన్నందున కొంత ఇబ్బందికరంగా ఉందని, అయినా ప్రయాణం సాగుతోందని తెలిపారు.

# వివేకానంద స్ఫూర్తితో రామకృష్ణ మఠం

**విద్యారంగంలో ఎందరికో ఆదర్శం❑స్వామి బోధమయానంద వెల్లడి**



హైదరాబాద్,జనవరి 11 (సమ సమాజం): మానవుని నైతిక, ధార్మిక ప్రవర్తనే కీలకమని వివేకానందుడు చెప్పారు. యువతను జాగృతం చేసి, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి ముందుకు నడిపిన వారిలో స్వామి వివేకానంద అగ్రగణ్యుడు. యువత రాన్ని ప్రేరేపించిన మహాశక్తి, గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని హైదరాబాద్ రామకృష్ణమఠం స్వామి బోధమయానంద అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ రామకృష్ణ మఠం ఇప్పుడు విద్యార్థులకు ఆలంబనగా నిలిచింది. ఎన్నో రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇంగ్లీష్‌తో పాటు ప్రపంచ భాషల్లో ఇక్కడ ఉచిత శిఓణ పొందే వీలుంది. అనేక రంగాల్లో కోర్సులను ప్రవేశ పెట్టి యువతను సన్మార్గంలో నడిచేలా చేస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు ఇప్పుడు విదేశాల్లో స్థిరపడ్డారు. పతనం నుంచి ఈ ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి వివేకానందుడు ప్రపంచాన్ని చైతన్యవంతం చేయటానికి ప్రయత్నించారు. విలువల దార్శనికతతో సమాజాన్ని ఉన్నతస్థితికి తీసుకొనిపోలేకపోతే భౌతిక సంపద తెచ్చిపెట్టే ప్రగతి పతనం వైపు దారితీస్తుంది. అందుకే భౌతికవాదానికి కొనసాగింపుగా ఆధ్యాత్మికత అవసరమని వివేకానంద భావించారని వివరించారు. మన మత వ్యవస్థలను హేతుబద్ధమైన, చైతన్యశీలమైన వేదాంతపు తర్కంతో విప్లవీకరించారు.అందుకే వివేకానందుడు చోదక శక్తిగా నిరంతరం యువతకు మేలుకొలుపుగా ఉంటాడు. గొప్ప అవకాశాలే వస్తే ఏమి చేతకాని వారు కూడా ఏదో గొప్ప సాధించ వచ్చు. కానీ ఏ అవకాశాలూ లేనప్పుడు కూడా ఏదైనా సాధించాలనే పట్టుదల ఉన్నవారే గొప్పవారు కాగలుగుతారు. ఇలాంటి కోవలోకి స్వామి వివేకానంద వస్తారు. అనంత శక్తి, అపారమైన ఉత్సాహం, అమేయ సాహసం, అఖండ సహనం ఇదే మనకు కావలి. వీటితోనే ఘనతను సొంతం చేసుకోగలం. వెనక్కి చూడకండి ముందడుగే వేయండి. అన్న సూక్తిని పాటించేలా జనాన్ని జాగృతం చేసిన మహనీయుడాయన. అన్నింటికి మించి పట్టుదలే మనిషిని మనీషిగా మారుస్తుందని ఉద్బోధిస్తాడు. దైవ విశ్వాసం కంటే మానవ విశ్వాసం ముఖ్యమని బోధిస్తాడు. ముక్కోటి దేవతలలోనూ నమ్మకమున్నా నీలో నీకే విశ్వాసం లేకపోతే నీకు ముక్తి లేదంటాడు. ఆయన భావజాలంతో సాగుతున్న జాతిపునర్నిర్మాణ కార్యంలో పాల్గొని రామకృష్ణ మఠం లాంటి సంస్థలు, వ్యక్తులు ఇప్పటికీ నిరంతరంగా శ్రమిస్తున్నాయి. భారతదేశంలో వేల సంవత్సరాలనుండే ఒక మనిషి జీవితానికి లక్ష్యం చతుర్విధ పురుషార్థాలుగా ధర్మం, అర్థం, కామం, మోక్షం అని చెప్పారు. భౌతికసుఖాలు, సంపదలు వద్దనలేదు. అందులోనే మునగకుండా సత్యాన్వేషణలో మోక్ష సాధనకు కృషిచేయాలని చెప్పారు. వివేకానందుని వ్యక్తిత్వాన్ని, సందేశాన్ని సామ్యవాద దేశాలు కూడా ప్రస్తుతించాయి. రష్యా, చైనాలలో వివేకానందుని 120వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. సామాజిక పరివర్తన అనే ఇంజనుకు తగిన ఇంధనం వేదాంతమేనని వివేకానందుని స్పష్టమైన అభిప్రాయం. ఆయన సామాజిక చింతనలో మరో స్పష్టత 'జాతీయ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థానంలో ఉన్న వారిని పడగొట్టటం కాదు, దిగువన ఉన్న వారిని ఉన్నతస్థితికి తీసుకొనివెళ్ళటం అన్నదే స్వామి లక్ష్యం. హిందుత్వంపై వివేకానంద గర్వ్‌సే కహో హమ్ హిందూ హై అని చెప్పారు. అలా చెబితే వేల సంవత్సరాల మన మహాపురుషుల పరంపర, చరిత్ర, సంస్కృతులు మనకు గుర్తువస్తాయి. వివేకానందుడు హిందూ సమాజ పునరుజ్జీవనానికి, సాంస్కృతిక జాతీయవాదాన్ని శక్తిమంతం చేయటానికి కృషి చేశారు. ఆయన ఒక ఆధ్యాత్మిక వేత్త, దార్శనికుడు, సామాజిక పరివర్తకుడు. వివేకానందునికి సత్యసిద్ధాంతమైన వేదాంతం ముఖ్యం. 'ఈ దేశం బాగుపడాలంటే జనసామాన్యాన్ని జాగృతపరచాలి. మన జాతి చేసిన అతిపెద్ద పాపం జన సామాన్యాన్ని నిర్లక్ష్యం చేయడం. వారిని ఎదగనిస్తే సమాజం బాగుపడుతుంది. వారికి సకారాత్మకమైన విద్య నందిస్తూ జాగృతం చేయటం మనందరి కర్తవ్యమని' వివేకానందుడు చెప్పేవారు. అందుకే 'దరిద్రదేవోభవ' అన్నది ఆయన మంత్రమయ్యింది. వివేకానందుడు సాంస్కృతిక జాతీయవాదానికి పెద్దపీట వేసాడని బోధమయానంద వివరించారు. స్వామి బోధనల మేరకు హైదరాబాద్ మఠం విశేషంగా కృషి చేస్తోందని అన్నారు. అనేక రంగాల్లో విశేషంగా సేవలు అందిస్తోంది.

# కోమటిరెడ్డి, హరీష్‌లకు షర్మిల ఆహ్వానం

**కొడుకు పెళ్లికి రావాలని పత్రికలు అందచేత**



హైదరాబాద్,జనవరి 11 (సమ సమాజం): కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిలా రెడ్డి తనయుడు వైఎస్ రాజారెడ్డి నిశ్చితార్థం ఈనెల18న, ఫిబ్రవరి 17న వివాహం జరగనున్న విషయం తెలిసిందే. దీనికి షర్మిల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. అలాగే ప్రముఖులకు స్వయంగా ఆహ్వాన పత్రాలు అందచేస్తున్నారు. ఇప్పటికే సిఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ తమిళసైకి ఆహ్వానాలు అందించారు. అలాగే షర్మిల తెలుగు రాష్ట్రాల్లోని పలువురు రాజకీయ ప్రముఖులను పెళ్లికి ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలోనే షర్మిల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహానికి కుటుంబ సమేతంగా విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రిక అందించారు. అలాగే మాజీ మంత్రి,సిద్ధిపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావుని సైతం షర్మిల ఆయన నివాసంలో కలిశారు. తన కుమారుడి వివాహానికి కుటుంబ సమేతంగా వచ్చి ఆశీర్వదించాలని కోరారు.

# గొంతులో నిమ్మకాయ ఇరుక్కుని చిన్నారి మృతి

అనంతపురం,జనవరి 11 (సమ సమాజం): అనంత జిల్లా పెద్దవడుగూరు మండలం మల్లేనిపల్లెలో బుధవారం తీవ్ర విషాదం జరిగింది. గ్రామానికి చెందిన వాలంటీర్ సకీదీప, గోవిందరాజుల దంపతుల కుమార్తె జశ్విత (9 నెలలు) ఆడుకుంటూ ఇంటి వరండాలో పడిన నిమ్మకాయను నోట్లో పెట్టుకుంది. దీన్ని గమనించిన తల్లి వెంటనే దాన్ని బయటకు తీసేందుకు యత్నించింది. అయితే, అది చిన్నారి గొంతులోకి వెళ్లిపోయింది. చిన్నారిని వెంటనే చికిత్స నిమిత్తం పెద్దవడుగూరు ఆస్పత్రికి తరలించారు. చిన్నారి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండడంతో మెరుగైన వైద్య కోసం పామిడి తరలించారు. అయితే, చిన్నారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆ దంపతులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనతో గ్రామంలోనూ తీవ్ర విషాదం నెలకొంది. ఏడేళ్ల తర్వాత ఆ దంపతులకు బిడ్డ పుట్టిందని.. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తరుణంలో ఆ చిన్నారికి ఇలా జరిగిందని స్థానికులు కన్నీరు మున్నీరయ్యారు.

# తెలంగాణలో ఎంపి ఎలక్షన్స్‌పై కాంగ్రెస్ ఫోకస్

మంత్రులతో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే భేటీ❑14 ఎంపి సీట్లలో గెలుపే లక్ష్యంగా దిశా నిర్దేశం❑సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశం



న్యూఢిల్లీ,జనవరి 11 (సమ సమాజం): తెలంగాణలో విజయంతో ఊపుమీదున్న కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికలపై కూడా దృష్టి సారించింది. రానున్న ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ లోక్‌సభ సమన్వయ కర్తలతో ఢిల్లీలో అధిష్ఠానంకీలక భేటీ నిర్వహించింది. రానున్న ఎన్నికల్లో అమలు చేయాల్సిన వ్యూహాలు, ప్రణాళికలపై సమావేశంలో చర్చించారు నేతలు. కాంగ్రెస్ పార్టీ ఇటీవలే తెలంగాణలోని 17 స్థానాలకు..14 మంది కోఆర్డినేటర్లను నియమించింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటికి శ్రీనివాసరెడ్డికి రెండేసి లోక్‌సభ నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించారు. ఇందులో భాగంగా నేటి సమావేశంలో.. మిత్రపక్షాలతో సమన్వయం చేసుకోవడంపై నేతలకు దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది. మొత్తం మీద టార్గెట్ 14 గా పెట్టినట్లు తెలుస్తోంది.. ఇదే వ్యూహంతో ముందుకు సాగాలని అధిష్టానం సూచించినట్లు సమాచారం.. మరోవైపు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ నుండి 13 నుంచి 14 సీట్లు గెలవబోతున్నామని సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.. . విజయమే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నట్టు చెప్పారు. ఇక రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలోని నేతలంతా పనిచేస్తామని మరో మంత్రి సీతక్క అన్నారు... త్వరలో అభ్యర్థుల పేర్లు అధిష్ఠానానికి నివేదిస్తామని.. ఫిబ్రవరి లోపు ఎంపీ అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుందని చెప్పారు. నేటి సమావేశంలో ఆయా అంశాలపై రాష్ట్ర నేతలకు హైకమాండ్ దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది.తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో కలసికట్టుగా ఎంపి సీట్లను సాధించాలన్నారు. మంత్రులు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు గురువారం నాడు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలు చర్చించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి సంబంధించిన పలు విషయాలను మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాకు వివరించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రచారం ఎలా ఉండాలి, పోల్ మేనేజ్మెంట్, ప్రజలతో మమేకం అవ్వడంపై ఖర్గే మార్గానిర్దేశర చేశారన్నారు. దేశ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలని భావిస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 17 కి 17 ఎంపీ స్థానాలు గెలవడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే రాష్ట్రానికి మరిన్ని నిధులు వస్తాయని తెలిపారు. రెండు, మూడు స్థానాల కోసం బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య పోటీ ఉందని అన్నారు. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసిందని చెప్పారు. 17 కి 17 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఆరు గ్యారెంటీలతోపాటు మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు అవకాశం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణలో 70 స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని మొదట చెప్పింది తానేనని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా పార్లమెంటు సీటును 3 లక్షల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ గెలుస్తుందని తెలిపారు. 14 లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ గెలుచు కుంటుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై చర్చించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించేందుకు పార్టీ హైకమాండ్ సీఎం రేవంత్ రెడ్డితో పాటు సమన్వయకర్తలను సమీక్షల కోసం ఢిల్లీకి ఆహ్వానించింది. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. అయితే పలు కారణాల వలన సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ రద్దు అయింది.దీంతో మొట్టమొదటి పార్లమెంట్ సమీక్షా సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి దూరం అయ్యారు. పార్లమెంటు ఎన్నికలపై తన అభిప్రాయాన్ని అధిష్టానానికి ఇప్పటికే తెలిపినందున రేవంత్ ఢిల్లీ పర్యటన రద్దు అయినట్లుగా తెలుస్తోంది. సీఎం షెడ్యూల్ లో సైతం ఢిల్లీ టూర్ లేదంటున్న సీఎంఓ వర్గాలు ప్రకటించాయి. ఎమ్మెల్సీ అభ్యర్థుల అంశంపై కూడా ఇప్పటికే అధిష్టానంతో చర్చించి అనుమతి తీసుకున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలపై పార్టీ ఫోకస్ పెట్టింది. తెలంగాణలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ గెలువాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో.. పార్టీ ముఖ్య నేతలు తీవ్రంగా పాటుపడుతున్నారు. ఇదిలా ఉంటే.. తెలంగాణ మంత్రులు కొందరు ఢిల్లీకి వెళ్లారు.లోక్ సభ ఎన్నికల సన్నద్ధత సమావేశంలో ఖర్గేతో చర్చించారు. తెలంగాణ లోక్ సభ ఇంచార్జిలతో అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే అయ్యారు. రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల అంశంపై చర్చించారు. లోక్ సభ స్థానాల్లో విజయం కోసం ఎలా చేయాలన్న దానిపై తెలంగాణ మంత్రులకు ఖర్గే సూచించారు. అలాగే టిక్కెట్ ఆశిస్తున్నవాళ్ల జాబితాను అధిష్టానం ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఉంచారు . అభ్యర్థుల్ని పరిశీలించి అధిష్టానం తన నిర్ణయం ప్రకటిస్తుంది. ఈనెల 15న సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు వెళు _న్నారు. తిరిగి వచ్చాక లోక్‌సభ నియోజకవర్గాలకు సమన్వకర్తలతో సమీక్షలు నిర్వహిస్తారని సమాచారం. ఇదిలావుంటే రెండు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల పేర్లను రేవంత్ రెడ్డి హైకమాండ్ కు పంపించారు. తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ తో పాటు అద్దంకి దయాకర్ పేరును ఎమ్మెల్సీ లుగా ఖరారు చేయాలని సిఫారసు చేసినట్లుగా తెలుస్తోంది. రెండో ఎమ్మెల్సీ అభ్యర్థిగా మైనార్టీ నాయకులకు అవకాశం కల్పించాలని హైకమాండ్ అనుకుంటే.. ఫిరోజ్‌ఖాన్, షబ్బీర్ అలీ పేర్లను పరిశీలించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పేర్లను రేవంత్ హైకమాండ్ కు పంపినందున.. వారి నిర్ణయం మేరకే.. నామినేషన్లు వేయనున్నారు. ఇక దక్షిణాదిలో కర్నాటక , తెలంగాణ విజయంతో ఇప్పుడు ఏపీపై కూడా దృష్టి పెట్టింది..కాంగ్రెస్ పార్టీ. ఇప్పటికే వైఎస్ షర్మిలను పార్టీలో చేర్చుకున్న కాంగ్రెస్ పార్టీ..ఏపీలో ఆమెకు కీలక బాధ్యతలను అప్పగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మరోవైపు లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీని బలోపేతం చేసే లక్ష్యంతో ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణిక్కం ఠాగూర్ రాష్ట్రంలో తొలిసారి పర్యటించారు. విజయవాడలో ఆయన పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. పార్టీలో కొత్త చేరికలపై దృష్టిసారించాలని నిర్ణయించారు. వైసీపీ, బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నేతలకు మాణిక్కం ఠాగూర్ సూచించారు.

# అజ్మీర్ దర్గాకు చాదర్ పంపిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ పంపించారు. గురువారం నాడు ఢిల్లీలో ముస్లిం మత ప్రముఖులు మోదీని అతని నివాసంలో కలిశారు. అజ్మీర్ షరీఫ్ దర్గాలో సూఫీ మత గురువు మొయినుద్దీన్ చిస్టీపై కప్పేందుకు చాదర్‌ను అందజేశారు. ప్రధాని మోదీ ఏటా అజ్మీర్ దర్గాకు చాదర్ పంపిస్తారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివెరియాలని ప్రధాని మోదీ సందేశం ఇచ్చారు. మొయినుద్దీన్ చిస్తీ సమాధిపై చాదర్ కప్పే సమయంలో ఆ సందేశం చదువుతారు.



# సీతారామతో ఖమ్మం జిల్లా సస్యశ్యామలం

పది లక్షల ఎకరాలకు గోదావరి జలాలు

యతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించిన తుమ్మల

ఖమ్మం,జనవరి 11 (సమ సమాజం): సీతారామ ప్రాజెక్టుతో ఖమ్మం జిల్లా సస్యశ్యామలంగా మారుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. సత్తుపల్లి మండలం యతాలకుంట వద్ద టన్నెల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తుమ్మల మీడియాతో మాట్లాడారు. పది లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందిస్తామని, సీతారామ ప్రాజెక్టులో ప్రధానమైందని యతాలకుంట టన్నెల్ అని తుమ్మల ప్రశంసించారు. టన్నెల్ పనులు రెండు వైపుల నుంచి చేసుకుంటూ రావాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయటమే తన రాజకీయ లక్ష్యమన్నారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న టన్నెల్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామల మవుతుందన్నారు. వీలైనంత తొందరగా ప్రాజెక్టును పూర్తిచేసి ఉమ్మడి జిల్లాలో పది లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందిస్తామని చెప్పారు. ప్రాజెక్టులో యాతాలకుంట టన్నెల్ ప్రధానమైనదని, పనులు రెండు వైపుల నుంచి చేసుకుంటూ రావాలన్నారు. సీతారామ ప్రాజెక్ట్ పనుల పురోగతిపై ఈ నెల 8న హైదరాబాద్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి నీటి పారుదలశాఖ అధికారులతో మంత్రి తుమ్మల ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మే నెలాఖరు కల్లా సీతారామ



ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని కాలువల పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పనుల్లో వేగం పెంచితే ఈ ఏడాదిలోనే వైరా రిజర్వాయర్, లంకాసాగర్ చెరువు, ఎన్నెస్పీ ఆయకట్టులోని సుమారు 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. ఏనూరు వద్ద లింకు కెనాల్ పనులకు టెండర్లు పూర్తి చేసి, పనులు మొదలు పెట్టాలన్నారు. యాతాలకుంటలో భూసేకరణ పూర్తయితే సత్తుపల్లి టన్నెల్ ద్వారా లంకసాగర్, బేతుపల్లి కెనాల్‌కు ఈ సీజన్‌లో సాగునీరు ఇవ్వొచ్చన్నారు. సత్తుపల్లి కెనాల్‌కు సంబంధించి భూసేకరణకు రూ.12 కోట్లు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పాలేరు టన్నెల్ పనులనూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తయితే పాలేరు రిజర్వాయర్‌కూ జలాలు తీసుకురావొచ్చన్నారు.

# షర్మిల తెలంగాణ వాసి..

ఎపిలో పదవి ఎలా కట్టబెడతారు


కాంగ్రెస్ అధిష్ఠానానికి హర్షకుమార్ ప్రశ్న

రాజమండ్రి,జనవరి 11 (సమ సమాజం): ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ పదవీని ఇటీవల పార్టీలో చేరిన వైఎస్ షర్మిలకు ఇచ్చే అవకాశం ఉండడంతో అప్పుతే పెదవి విరుపులు మొదలయ్యాయి. పార్టీలో చేరే సమయంలో హైకమాండ్ పెద్దలు మాట ఇచ్చారని ప్రచారం జరిగింది. అయితే షర్మిలకు పార్టీ అధ్యక్ష పదవీ ఇవ్వొద్దని కొందరు నేతలు అంటున్నారు. ఏపీ కాంగ్రెస్‌లో రెబల్, మాజీ ఎంపీ హర్షకుమార్ ఈ నిర్ణయాన్ని బహిరంగంగా వ్యతిరేకించారు. 'షర్మిల తెలంగాణకు చెందిన వారు. ఆంధ్రప్రదేశ్‌తో సంబంధం లేదు. ఇక్కడ పార్టీ పగ్గాలు అప్పగించడం సరికాదు. తెలంగాణ కోడలు అయినందున ఏపీ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను ఇవ్వొద్దని హర్షకుమార్ స్పష్టంచేశారు. అతని వ్యాఖ్యలపై ఇతర నేతలు, కాంగ్రెస్ హైకమాండ్ స్పందించాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌ను గద్దె దింపేందుకు దళితులు సిద్ధంగా ఉన్నారని హర్షకుమార్ అంటున్నారు. ఫిబ్రవరి 8వ తేదీన రాజమండ్రిలో 'దళిత సింహగర్జన' నిర్వహిస్తున్నామని వివరించారు. వైసీపీ హయాంలో దళితులపై దాడులు ఎక్కువ అయ్యాయని గుర్తుచేశారు. కేసులు నమోదు చేశారని ఒక్కరికి కూడా న్యాయం జరగలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను అమలాపురం లోక్ సభ నుంచి పోటీ చేస్తానని చెబుతున్నారు. ప్రస్తుతం ఏపీ పీసీసీ చీఫ్‌గా గిడుగు రుద్రరాజు ఉన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏపీలో కాంగ్రెస్ ప్రభావం పూర్తిగా తగ్గింది. ఒక్క అసెంబ్లీ, లోక్ సభ సీటును గెలవలేదు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ షర్మిలను రంగంలోకి దింపింది. పదవీపై ఇప్పటివరకు ప్రకటన చేయలేదు. పీసీసీ చీఫ్‌గా చేయొద్దని హర్షకుమార్ అంటున్నారు. దీనిపై హైకమాండ్ ఏం ఆలోచన చేయనుందో చూడాలి.



# రాజా ది గ్రేట్

అశోక్‌ది సింపుల్ లివింగ్ ◆ ప్రశంసలు కురిపిస్తున్న నెటిజన్లు



హైదరాబాద్,జనవరి 11 (సమ సమాజం): మంత్రిగా, కేంద్రమంత్రిగా పనిచేసినా సాదాసీదాగా ఉండడం మాజీమంత్రి అశోకగజపతిరాజుకు అలవాటు. ఆయన ఏనాడూ తాను రాజకుటుంబానికి చెందిన వ్యక్తిననే అహంభావానికి పోలేదు. రాజ కుటుంబానికి చెందిన వ్యక్తి, అయినా.. గతంలో ఏడు సార్లు ఎమ్మెల్యేగా, తర్వాత ఎంపీగా కూడా పనిచేశారు. కానీ ప్రస్తుతం మాత్రం అతను చాలా సాధారణంగా ప్రజలతో కలిసి జీవిస్తున్నారు. అతను గతంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కూడా పనిచేయడం విశేషం. విజయనగరం రాజ కుటుంబం నుంచి వచ్చిన అశోక్ గజపతి రాజు సాధారణ వ్యక్తిగా జీవించడానికే ఇష్టపడతారు. తాజాగా ఆయన తన కుటుంబంతో కలిసి హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు కోసం ఎదురు చూస్తున్నారు. ఆ క్రమంలో అతనికి సంబంధించిన చిత్రాలను ఓ వ్యక్తి క్లిక్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడైన కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు నిరాడంబర జీవితం గడపడం పట్ల నెటిజన్లు పలు రకాలుగా కామెంట్లు చేస్తున్నారు. రాజు సింప్లిసిటీకి ఇది నిదర్శమని ఓ వ్యక్తి ప్రశంసించారు. అతను ఎటువంటి భద్రత లేకుండా విజయనగరం వీధుల్లో తిరగడం నేను చుశానని మరోక వ్యక్తి కామెంట్ చేశారు. రాజ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ అతను ప్రజా జీవితంలో నిజాయితీగా ఉంటారని ఇంకొక వ్యక్తి వ్యాఖ్యానించారు. ఈ చిత్రాన్ని టీడీపీ తన సోషల్ మీడియా విభాగమైన ట్విట్టర్‌లో పోస్ట్ చేయగా..ఈ పోస్ట్‌ను షేర్ చేసినప్పటి నుంచి లక్షా 35 వేల మందికి పైగా ప్రజలు దీన్ని వీక్షించారు. అంతేకాదు 4727 మందికిపైగా లైక్ చేసి అనేక మంది రీట్వీట్లు కూడా చేస్తున్నారు. అయితే గజపతి రాజు గతంలో 1978లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. రాజు 1983లో తొలిసారిగా కేబినెట్ మంత్రి అయ్యారు. దీని తర్వాత 2004 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో వివిధ మంత్రిత్వ శాఖల పోర్ట్‌ఫోలియోను ఆయన నిర్వహించారు. 2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కానీ 2018 మార్చిలో రాజీనామా చేశారు. ప్రస్తుతం గజపతిరాజు విజయనగరంలోని గజపతుల బంగ్లాలో నివసిస్తున్నారు. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో తన నియోజవకర్గానికి చెందిన వారిని ఎవరినీ హైదరాబాద్‌కు రానిచ్చేవారు కాదు. సమస్యలను నేరుగా తాసిల్దార్, కలెక్టర్లకు అర్జీలు సమర్పించేలా చేసేవారు. సమస్యలను వారికి చెప్పినా పట్టించుకోకపోతేనే ఆయన రంగంలోకి దిగేవారు. తనవద్దకు రావడం వల్ల అనవసరంగా ప్రయాణ, లాడ్జి ఖర్చులు అవుతాయని వాదించేవారు. అందుకే ఆయన పేషీలో ఎప్పుడూ పైరవీకారులు కూడా ఉండేవారు కాదు.

# జగనన్న తోడు 8వ విడత నిధులు విడుదల



అమరావతి,జనవరి 11 (సమ సమాజం): జగనన్న తోడు పథకం 8 వ విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం విడుదల చేశారు. నిరుపేద చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సాంప్రదాయ చేతివృత్తుల వారికి వడ్డీ లేని రుణం ఇస్తున్నట్టు సీఎం వెల్లడించారు. ఏటా 10 వేల చొప్పున సున్నా వడ్డీకి రుణాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రుణాలు చెల్లించిన 15.87 లక్షల లబ్దిదారులకు ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.88.33 కోట్ల వడ్డీ చెల్లించిందని తెలిపారు. 16,73,576 మంది లబ్దిదారులకు రూ.3,373.73 కోట్లు వడ్డీ లేని రుణాలు అందించామని చెప్పారు. ఇవాళ కొత్తగా 86 వేల మందికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. రుణాలు తీసుకున్న వారిలో 95 శాతం మంది తిరిగి చెల్లింపులు చేస్తున్నారని సీఎం జగన్ వెల్లడించారు.

# పటిష్ట సంస్థగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్




(మొదటి పేజీ తరువాయి) భర్తీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రదర్శిస్తోంది. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి ఓకే చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ తర్వాత ఐదు గ్యారంటీల అమలుకు ముందడుగు వేసింది. ప్రజాపాలన - అభయహస్తం పేరుతో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఇప్పుడు తాజాగా తెలంగాణలో ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. ఫిబ్రవరి లోనే ఉద్యోగాల నియామకాలు మొదలు పెడుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. దీంతో ఉద్యోగ నోటిఫికేషన్ కోసం లక్షలాది విద్యార్థులు ఎదురుచూస్తున్న పరిస్థితి. టీఎస్పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామా ఆమోదంతో ఉద్యోగాల నియామకాలకు అడ్డంకులు తొలగిపోయాయి. అతి త్వరలో టీఎస్పీఎస్సీ బోర్డు చైర్మన్, సభ్యులను సర్కార్ నియమించనుంది. చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ లేదా ఐపీఎస్ ఆఫీసర్‌ను నియమించే అవకాశం ఉంది. ఇటీవలే యూపీఎస్సీ ఛైర్మన్‌ను సీఎం రేవంత్ కలిసిన విషయం తెలిసిందే. పారదర్శకంగా బోర్డు ఉండేలా కసరత్తు చేపట్టారు. ప్రతీ సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. టీఎస్పీఎస్సీ బోర్డులో చైర్మన్‌తో పాటు 10 మంది సభ్యులు ఉండనున్నారు. బోర్డులో ఉండాల్సిన నిపుణుల కోసం ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. సీఎం విదేశీ పర్యటన తర్వాత కొత్త బోర్డు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఈ క్రమంలో తెలంగాణ సర్వీస్ కమిషన్‌పై సిఎం రేవంత్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# ఆంధ్రా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు



(మొదటి పేజీ తరువాయి) అవుతున్నారు. ఆర్టీసీ కూడా ఇదే అదనుగా ప్రత్యేక బస్సులను సిద్దం చేసింది. వివిధ ప్రాంతాలకు అనుగుణంగా లగ్జరీ బస్సులను తెలంగాణ ఆర్టీసీ అధికారులు అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ కు చెందినవాళ్లు ఎక్కువగా సెటిల్ అయ్యి ఉండటంతో.. ఎక్కువగా జంట నగరాల నుంచి ఏపీకి పయనం అవుతుంటారు. ఈ పండగ సీజన్ దగ్గర పడటంతో ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.. ఈ సంక్రాంతి పండుగకు ఒక్క విశాఖ మీదుగా లక్షన్నర మంది ప్రయాణికులు.. తమ గ్రామాలకు వెళ్తారని ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తగ్గట్లుగా బస్సులను సిద్ధం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర వాళ్లు ఎక్కువగా హైదరాబాద్ లో సెటిల్ కావడంతో.. హైదరాబాద్ నుంచి విశాఖకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు రంగం సిద్ధం చేశారు. హైదరాబాద్ తో పాటు బెంగళూరు, చెన్నై నుంచి కూడా ప్రయాణికులు వస్తారని భావిస్తున్నారు. అవసరమైతే అదనపు బస్సులు కూడా వేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఆన్ లైన్ లో టిక్కెట్ల విక్రయం ప్రారంభమైంది. ఆర్టీసీ కాంప్లెక్సులోని ప్రత్యేక కౌంటర్లలో టిక్కెట్లు జారీ చేస్తున్నారు. విశాఖ నుంచి విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, శ్రీకాకుళం, టెక్కలి, ఇచ్ఛాపురం ప్రాంతాలకు అదనపు బస్సులు ఏర్పాటు చేశారు. అయితే సరైన సమయంలో బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందంటున్నారు ప్రయాణీకులు. సమయానికి ఆర్టీసీ బస్సులు రాక.. ప్రైవేట్ బస్సులు దోపిడీకి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న అదనపు బస్సులతో ఆదాయం కూడా పెరిగిందన్న భావనలో ఆర్టీసీ ఉంది. పండగమీద మమకారంతో పలువురు ఉద్యోగులు ఆంధ్రాప్రాంతానికి చేరుకుంటున్నారు. సొంత వాహనాలు ఉన్న వారితో దిగుతున్న వారితో ఆంధ్రా జిల్లాల్లో సందడి కనిపిస్తోంది. శని, ఆది వారాలు ఎలాగూ సెలవులు ఉంటాయి కాబట్టి మూడు రోజులు సొంతూరిలో గడపచ్చనుకున్న వారు చేరుకుంటున్నారు. పండుగ వేళల్లో జిల్లాలకు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది.

# పనులు చేయకుండా ప్రచారం చేస్తే బాగుండేది



(మొదటి పేజీ తరువాయి) అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మేము ఏనాడు చెప్పుకోలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు సైతం అత్యధిక వేతనాలు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం కానీ మేము చెప్పుకోలేదు, ప్రచారం చేసుకోలేదన్నారు. దేశంలో అందరికన్నా ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగులకు 73శాతం జీతాలు పెంచిన ఏకైక నాయకుడు కేసీఆర్. 29 లక్షల ఫించన్లను 46 లక్షలకు పెంచినా ఏనాడు చెప్పుకోలేదని గుర్తు చేశారు. దేశంలో అందరికన్నా ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది తెలంగాణ ప్రభుత్వమే కానీ ఇలాంటి అనేక అంశాలను చెప్పుకోవడంలో విఫలమయ్యాం. అందుకే కాంగ్రెస్ పార్టీ అబద్దాల ముందు అభివృద్ధి ఓడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. పనుల మీద కంటే ప్రచారం మీద ఫోకస్ చేసి ఉంటే మేమే గెలిచే వాళ్లం అన్నారు. స్థానిక సంస్థల నుంచి మెదలుకొని, అసెంబ్లీ దాకా బలమైన నాయకత్వం మనకున్నది. బలమైన ప్రతిపక్షం మనది. అన్నిటికి మించి కేసీఆర్ లాంటి గొప్ప నాయకుడు మనకున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికలే మన గెలుపునకు సోపానం కావాలన్నారు. ఎన్నికల ముందు రైతు రుణమాఫీ చేస్తామంటూ రేవంత్ రెడ్డి అనేక మాటలు మాట్లాడారు. రుణం ఉన్నవాళ్లే కాదు, వ్యవసాయ రుణం లేనివాళ్లు కూడా తీసుకోండని సూచించారు. అధికారంలోకి రాగానే వెంటనే రుణమాఫీ చేస్తామన్నారు. ఇచ్చిన అడ్డగోలు హామీలను నెరవేర్చే దారిలేకనే అప్పులంటూ, శ్వేతపత్రాలంటూ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఎవరు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు. ఇలాంటి పార్టీ సమావేశాలను వరుసగా పెట్టుకుందాం. అనుబంధ సంఘాలను బలోపేతం చేసుకుందామన్నారు. పార్టీకి అన్ని వర్గాలను దగ్గరయ్యేలా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. గిరి జనులకు స్థానిక సంస్థల రిజర్వేషన్ తో పాటు.. పోడు భూముల పట్టాల పంపిణీ, అనేక ఇతర సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో కొనసాగించింది. అయినా గిరిజనులు ఎక్కువ ఉన్న చోట్లకూడా ప్రజలు పూర్తి మద్దతు మనకివ్వలేదన్నారు. ఇలాంటి వాటన్నింటిపై ఆత్మవిమర్శ చేసుకుని ముందుకుపోదామని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే



(మొదటి పేజీ తరువాయి) సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. 30 శాతం పోలీసులకు రాయతీ ఇస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్ మూడు కేటాగిరీలు ఉన్నాయన్నారు. నగరంలో పోలీసులు నిరంతరం ట్రాఫిక్‌ని పర్యవేక్షించాలని చెప్పారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్‌పై పూర్తి సమాచారం అధికారులకు ఇస్తున్నామని సీపీ తెలిపారు. స్కూల్స్ వద్ద పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. ఊఅ-ఃూఅ ద్వారా ట్రాఫిక్‌పై స్కూల్స్‌లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. క్విజ్ ద్వారా పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలకు ట్రాఫిక్ రూల్స్‌ని కూడా తెలియజేయాలని చెప్పారు. కార్ పుల్లింగ్ ద్వారా సమస్యలకు చెక్ పెట్టాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. నగరంలో 31 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు అయినట్లు తెలిపారు. కొత్త ఆలోచనలతో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కార మార్గాలు తయారు చేసుకోవాలని సీపీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

# 14నుంచి రాహుల్ న్యాయ్‌యాత్ర




(మొదటి పేజీ తరువాయి) గుర్తు చేశారు. బీజేపీ(ఃఏఖ) ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిందని శమా అహ్మద్ ఆరోపించారు. మరోవైపు నిత్యావసరాల ధరలతోపాటు ఇంధన ధరలు కూడా భారీగా పెరిగిపోయాయని అన్నారు. ప్రధాని మోదీ అబద్దాలు చెబుతూ సామాన్య ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి విమర్శించారు. దీంతోపాటు పలు చోట్ల ఆదివాసీ, అల్ప వర్గాల మీద దాడులు జరుగుతున్నాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలపై జరిగిన దాడులకు న్యాయం జరగడం లేదని ఎద్దేవా చేశారు. అంతేకాదు ప్రశ్నించిన వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇక బ్రిజ్ భూషణ్ విషయంలో ఆధారాలతో సహా తప్పిదాలు జరిగినట్లు ఫిర్యాదులు అందినా కూడా ఇప్పటివరకు అతనిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని శమా అహ్మద్ ప్రశ్నించారు.

# సంక్రాంతికి సై అంటున్న జాతి పుంజులు



(మొదటి పేజీ తరువాయి) సమాచారం. దీనిపై ప్రజలు సంప్రదాయానికి విలువనిస్తారో, జూదాలు నిర్వహిస్తున్నవారిపై ఫిర్యాదులు ఇచ్చి కట్టడి చేస్తారో తేలాల్సి ఉంది. ఉభయగోదావరి జిల్లాల్లోని పలు కొబ్బరితోటలు, గోదాముల్లో పలువురు వైసీపీ నేతలు వందలాది జాతి పుంజులను అమ్మకానికి ఉంచడంతో పశ్చిమగోదావరితోపాటు జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి ఇక్కడకొచ్చి లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. జాతి రకాన్ని బట్టి పుంజును విక్రయిస్తున్నారు. ధర ఎక్కువైనా పలువురు పందెంరాయళ్లు ఎగబడి కొంటుండడం విశేషం. ఇలా ప్రత్తిపాడు, సామర్లకోట, పెద్దాపురం,తుని, ఏలేశ్వరం, కోనసీమలోని పలు మండలాల్లో కొబ్బరి తోటల్లో ఎక్కువగా అధికార పార్టీ నేతలు, ఆ పార్టీకి చెందిన పలువురు సర్పంచ్‌లు, వారితో అను బంధం ఉన్న పలువురు పందెంరాయుళ్లు జోరుగా పందెం పుంజులను ఫాం హౌస్‌ల్లో విక్రయిస్తున్నారు. అనేక చోట్ల పుంజుల విక్రయాలు పండగ దగ్గరపడడంతో పుంజుకున్నాయి. జాతి పుంజులకే డిమాండ్ ఉండడంతో వీటినే ఇక్కడ అమ్ముతున్నారు. ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు ఉన్న జాతి పుంజులకు డిమాండ్ అధికంగా ఉందని విక్రయదారులు వివరించారు. సంక్రాంతి పందేల కోసమని ఇప్పటివరకు ఒక్కో పుంజుకు రోజుకు రూ.300 వరకు ఖ ర్చు చేసినట్టు పేర్కొన్నారు. దీంతో వీటికి ఎక్కువ గిరాకీ పలుకుతోంది.మూడు రోజులు జరిగే పందేల్లో అత్యధిక రౌండ్లలో నెగ్గిన వారికి కారు బహుమతిగా ఇవ్వాలని నిర్ణయించారు.

# హిందూ వ్యతిరేకతను చాటుకున్న కాంగ్రెస్

## అయోధ్యను రాజకీయం చేసిందే ఆ పార్టీ

కాంగ్రెస్ బహిష్కరణ పిలుపుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 11 (సమ సమాజం): అయోధ్య కార్యక్రమాన్ని బహిష్కరించడం ద్వారా కాంగ్రెస్ తన హిందూ వ్యతిరేకతను మరోమారు చాటుకుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ దివాళాకోరు రాజకీయాలకు ఇది పరాకాష్ట అన్నారు. అయోధ్యతో రాజకీయాలకు సంబంధం ఏముందన్నారు. ఇది దేశా ఔన్నత్యానికి, గౌరవానికి ప్రతీక అన్నారు. రామమందిరం ప్రారంభోత్సవాన్ని కాంగ్రెస్ బహిష్కరించడంపై కిషన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. బహిష్కరించటం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అయోధ్య ఆలయ ప్రారంభోత్సవానికి దూరంగా ఉండాలన్న కాంగ్రెస్ నిర్ణయం.. హిందువులను అవమానించటమే అని అన్నారు. హిందువుల జీవన విధానమంటే కాంగ్రెస్‌కు చులకన అని మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాలు, ఎన్నికల కమిషన్‌ను కాంగ్రెస్ బహిష్కరిస్తోందన్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న నాయకత్వం కాంగ్రెస్ ది అని విమర్శించారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలంటే కాంగ్రెస్‌కు గౌరవం లేదన్నారు. హిందుత్వ వ్యతిరేక ధోరణిని కాంగ్రెస్ మరోసారి బయటపెట్టుకుందన్నారు. అధికారమే పరమావధిగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించటం దుర్మార్గమని కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ దృక్పథంతో కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుందని అన్నారు. ప్రణమ్ ముఖర్జీకి భారతరత్న ఇవ్వడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందని అన్నారు. హిందువులకు సంబంధించిన ప్రతీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని విమర్శించారు. అయోధ్య కేసు విషయంలో కాంగ్రెస్ పార్టీ వితండవాదం చేసిందన్నారు. సనాతన ధర్మాన్ని క్యాన్సర్‌తో పోల్చి.. కాంగ్రెస్ పార్టీ దిగజారిపోయిందన్నారు. 1947లో సోమనాథ్ దేవాలయానికి వెళ్లొద్దని .. అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌కు నెహ్రూ లేఖ రాశారని గుర్తుచేశారు. అయోధ్య రామమందిరం జాతికి సంబంధించిన కార్యక్రమమని స్పష్టం చేశారు. రామాలయం ప్రారంభోత్సవానికి ఫాస్టర్లు, ముస్లిం మత పెద్దలు హాజరవుతున్నారని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

# దళితబంధు కోసం కొందరి ఆందోళన



(మొదటి పేజీ తరువాయి) చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అ దళితుల అభ్యున్నతి కోసం తీసుకొచ్చిన పథకాన్ని రద్దు చేయొద్దని డిమాండ్ చేశారు. గతంలో మంజూరైన యూనిట్లకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ పథకం ద్వారా ఎంతోమంది దళితులు ఆర్థికంగా బాగుపడ్డారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దళితబంధు పథకం అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో దళిత సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నాయని అంటున్నారు. అయితే ఇదంతా బిఆర్ఎస్ ప్రోద్బలంతో జరిగిందని స్థానికులు విమర్శిస్తున్నారు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in